కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :163 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 16-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్..



విజయవాడ, అక్టోబర్ 15: పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని.. కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించిందన్నారు. దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో భాగంగా 'లఖ్‌పతి దీదీ' మేళాను నిర్వహించడం ఒక విశేషమైన కలయికగా భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధి అంటే గ్రామాల వికాసమని చెప్పుకొచ్చారు. మహిళల స్టాళ్లను సందర్శించే అవకాశం దక్కిందని.. వారి ఉత్సాహం, వారి ముఖాల్లోని చిరునవ్వు చూస్తుంటే మహిళలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని స్పష్టమవుతోందన్నారు. ఒకప్పుడు మహిళలు వెనుకబడి ఉండేవారని.. కేవలం కుటుంబ సంరక్షణకే పరిమితమై, ఆర్థికంగా చిన్న చిన్న అవసరాల కోసం కూడా ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ నేడు మహిళలు సంపూర్ణంగా స్వయం సమృద్ధి సాధించారన్నారు.

ఇతరులకు ఆసరాగా మహిళలు

మహిళలు కేవలం స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, ఇతరులకు కూడా ఆసరాగా నిలుస్తున్నారని ముర్ము తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనలో మహిళల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన, మహిళల సంకల్పం దేశంలోని ముఖ్యమంత్రులందరి ఉమ్మడి కృషి ఫలితంగా మహిళా సాధికారత ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. 2047 కంటే ముందే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని ధీమా వ్యక్తం చేశారు.

మహిళల భాగస్వామ్యం పెరిగింది

వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమైనదని రాష్ట్రపతి వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థిక, సాంకేతిక సామాజిక సాధికారత దిశగా కొత్త మార్గం లభించిందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు, కుటుంబంలో ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ మహిళల భాగస్వామ్యం పెరిగిందన్నారు. భారతదేశం భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు, వేర్వేరు సంప్రదాయాలు కలిగిన దేశమైనప్పటికీ అంతా ఒక్కటే అని అన్నారు.

గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ప్రాధాన్యం

ప్రస్తుత గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మంది మహిళలు రాజకీయాల్లో భాగస్వాములవుతున్నారని ద్రౌపది ముర్ము అన్నారు. ఒకప్పుడు బ్యాంకుల వద్దకు వెళ్లడానికి సంకోచించిన మహిళలు, నేడు ఎవరి సాయం లేకుండా స్వయంగా బ్యాంకులకు వెళ్లి తమ పనులను స్వతంత్రంగా చక్కబెట్టుకుంటున్నారని తెలిపారు. అంత్యోదయ సమగ్ర దృక్పథానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తన గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలే గ్రామాల రూపురేఖలను మార్చే నాయకత్వాన్ని అందిస్తున్నారని చెప్పారు. భారత ప్రభుత్వం లఖ్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళా సాధికారతకు ఒక ప్రత్యేకమైన వేగం, దిశానిర్దేశం అందించిందన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు..

డిజిటల్ సేవలు, పునరుత్పాదక ఇంధనం వంటి ఆధునిక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతూ, వారికి నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ముర్ము అన్నారు. గవర్నర్‌గా ఉన్న సమయంలో అక్కడి గ్రామీణ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ఆ మహిళలు ల్యాప్‌టాప్‌లను ఉపయోగిస్తూ ఎంత పెట్టుబడి పెడుతున్నారు, ఎంత లాభం పొందుతున్నారు, భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి అనే వివరాలను స్వయంగా ల్యాప్‌టాప్‌లలో నమోదు చేసుకుంటూ పనులు చేసుకునేవారని తెలిపారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, కుటుంబంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్ మాదిరిగా గడ్డం పెంచుకుంటే అధికారంలోకి వస్తావా?



హైదరాబాద్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అధికార పార్టీ నుంచి ఎదురుదాడి మొదలైంది. సింగరేణి కార్మిక గర్జనలో ఆయన చేసిన ఆరోపణలకు ధీటుగా కౌంటరిచ్చింది కాంగ్రెస్ సర్కార్. ప్రస్తుతం కేటీఆర్ మానసిక పరిస్థితి బాగోలేదని, ఆయన్ని చూసి ప్రజలు చర్చించుకుంటున్నారని ఆరోపించారు ప్రభుత్వ విప్ వేముల వీరేశం.

కేటీఆర్‌కు విప్ వీరేశం స్ట్రాంగ్ కౌంటర్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సింగరేణి కార్మిక గర్జన గురించి కీలక విషయాలు బయటపెట్టారు ప్రభుత్వం విప్ వేముల వీరేశం. సింగరేణికి కేటిఆర్ సినిమా ప్రమోషన్ మాదిరిగా వెళ్లారని, అక్కడ కొత్త పల్లవి ఎత్తుకున్నారని ఆరోపించారు. గడ్డం పెంచుకుని వేషం మారుస్తున్నారని, గడ్డం పెంచుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాదిరిగా అధికారంలోకి వస్తామని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గురువారం మీడియా ముందుకొచ్చిన విప్ వీరేశం.. ప్రస్తుతం కేటీఆర్ మానసిక పరిస్థితి బాగోలేదని, ఆయన్ని చూసి చర్చించుకుంటున్నారని విమర్శించారు. దోచుకున్నది దాచుకోవడానికి సతమతమవుతున్నారని అన్నారు. కేటీఆర్‌కు దమ్ముంటే ఈ- కారు రేసు, కాళేశ్వరం గురించి విచారణ చేయమని లేఖ రాయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో చెల్లె ఒక భాగమైతే.. సంతోష్‌రావు మరో భాగం దోచుకున్నారని ఆరోపించారు. సిరులు కురిపించే సింగరేణిని చెరబట్టి దోచుకున్నారని, వాళ్లు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. సింగరేణికి ద్రోహం చేసింది మీరు కదా? అంటూ ప్రశ్నలు రైజ్ చేశారు. అడ్డంగా దొరికిన దొంగ కేటిఆర్ అని, మూడు హోటల్స్ ఉన్నాయని ఒప్పుకున్నారని అన్నారు.కేసీఆర్ బయటకు వస్తారని పదే పదే కేటీఆర్ చెబుతున్నారని, పెద్దాయన బయటకు రారని తేల్చేశారు విప్. కేటీఆర్.. సింగరేణికి వస్తే కార్మికుల సమస్యలు గురించి మాట్లాడుతారని అనుకున్నామని, అక్కడ సీఎం రేవంత్ కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ విజన్‌తో ప్రజలు ఏకీభవిస్తున్నారని, అందుకే కేసీఆర్ బయటకు రాలేకపోతున్నారని తనదైన శైలిలో చెప్పుకొచ్చారు.ఎలినినోకు సీఎం రేవంత్‌రెడ్డి కారణమని అంటున్నారని, మరి కరోనాకు కేసీఆర్ కారణమా అంటూ ప్రశ్నలు రైజ్ చేశారు. పారాసిట్ మాల్ వేసుకోమని మేము ఏమైనా చెప్పామా? 1951నుండి 2026 వరకు 16సార్లు ఎల్‌నినో పరిస్థితులు వచ్చాయని, దానివల్ల వర్షాలు తగ్గాయని నిపుణులు చెబుతున్నారని అన్నారు. కానీ ఈ విషయంలో కేటీఆర్ సోయి లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

రాబోయే 8 నెలలు అత్యంత కీలకం.. అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



హైదరాబాద్,తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అప్రమత్తమైంది. ఇప్పటికే సాగులో ఉన్న పంటలకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలపై దృష్టి సారించింది.ఇందులో భాగంగా, రైతుల పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

రాబోయే 8 నెలలు అత్యంత కీలకం

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే ఎనిమిది నెలలు రాష్ట్రానికి అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీరు మరియు విద్యుత్ సరఫరా విభాగాల్లో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలు చేతికి వచ్చేంత వరకు అవసరమైన నీటి లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చుక్క నీరు కూడా వృథా కావొద్దు

రాష్ట్రంలోని నీటి వనరులను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు తేల్చి చెప్పారు. భవిష్యత్తులో నీటి కొరత తీవ్రం కాకుండా నీటి నిల్వలను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు.

విద్యుత్ పొదుపుపై సీఎం కీలక సూచనలు

ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్ ఊహించని రీతిలో పెరిగే అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, ఓపెన్ మార్కెట్‌లో తగినంత విద్యుత్ అందుబాటులో ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. అందువల్ల ప్రస్తుతం అందుబాటులో ఉన్న విద్యుత్‌ను ఎంతో పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. రాబోయే నెలల్లో నీటి లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ తగిన నిర్ణయాలు తీసుకోనున్నారు.

హైటెక్ యుద్ధాల యుగంలో దేశ భద్రతకు కొత్త సవాళ్లు



న్యూఢిల్లీ,శాంతిని కోరుకోవడం భారతీయ నాగరికతలో భాగమని, అయితే శాంతిని కాపాడుకోవడానికి అవసరమైన శక్తి కూడా దేశానికి ఉండాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. టైమ్స్ నౌ డిఫెన్స్ కాంక్లేవ్ 2026 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో హైబ్రిడ్, హైటెక్, హైపర్ వార్‌ఫేర్ వంటి కొత్త తరహా యుద్ధ పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో భారత్ అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని తెలిపాయి. తప్పుడు సమాచార ప్రచారం, దేశంలో అస్థిరత సృష్టించే ప్రయత్నాలు, ఉద్భవిస్తున్న భద్రతా ముప్పులను సమర్థంగా ఎదుర్కోవాలని సూచించాయి.

ఉగ్రవాదం కొత్త రూపాలు

ప్రస్తుతం ఉగ్రవాద ముప్పు కేవలం ఉగ్రవాద సంస్థలకే పరిమితం కావడం లేదని పేర్కొన్నారు. వైట్ కాలర్ ఉగ్రవాదం, ఒంటరిగా దాడులకు పాల్పడే వ్యక్తుల రూపంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని వివరించారు. ఇలాంటి ముప్పులను ముందుగానే గుర్తించడం భద్రతా సంస్థలకు కష్టతరంగా మారుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి పౌరుడి అప్రమత్తత, బాధ్యత దేశ భద్రతకు కీలక రక్షణ కవచంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు, తప్పుడు ప్రచారాన్ని గుర్తించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి అంశాలు సమాజ భద్రతలో ముఖ్యమని వివరించారు.

ఉగ్రవాదానికి దీటైన సమాధానం

ఉగ్రవాదాన్ని భారత్ సహించబోదని, దేశ సార్వభౌమత్వం, భద్రతకు ముప్పు కలిగించే చర్యలకు తగిన సమాధానం ఇస్తుందని పేర్కొన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడి, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉగ్రవాదాన్ని దాని మూలాల నుంచి నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉందని తెలిపారు.

రక్షణ రంగంలో సమగ్ర మార్పులు

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత రక్షణ రంగంలో విస్తృత మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రక్షణ రంగ సంస్కరణలు, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాల ద్వారా స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీకి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పరిశ్రమలు, స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు), ఆవిష్కర్తలు కలిసి పనిచేసే స్వయం సమృద్ధ రక్షణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, అత్యాధునిక రక్షణ పరికరాలను దేశీయంగా తయారు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

రక్షణ సాంకేతికతలో యువతకు ప్రోత్సాహం

దేశ భద్రతలో భారత యువత సాంకేతిక భాగస్వామిగా ఎదుగుతోందని వివరించారు. ఐడెక్స్ (iDEX), ఐడెక్స్ ప్రైమ్, అదితి వంటి కార్యక్రమాల ద్వారా యువత, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు రక్షణ రంగంలో ఆవిష్కరణలు చేపట్టేందుకు అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. డ్రోన్లు, కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో యువ ప్రతిభ దేశీయ రక్షణ సాంకేతికతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

స్వదేశీ తయారీకి ఊతం

గత 12 ఏళ్లలో భారత రక్షణ రంగంలో అనేక నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రక్షణ రంగ ప్రభుత్వ రంగ సంస్థలు (డీపీఎస్‌యూలు) లాభాల్లోకి వచ్చాయని, స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీకి కొత్త ఊపు లభించిందని తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు హరీశ్‌రావు సంఘీభావం



సిద్దిపేట : ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేటలో నిరవధిక సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను చాయ్ తాగినంత సమయంలోనే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఆ మాటను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు.

మూడేళ్లవుతున్నా హామీలేవీ?

ఎన్నికల సమయంలో ఎన్‌హెచ్ఎం, ఆయుష్, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఆ హామీల అమలులో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చాయ్ తాగినంత సమయంలోనే ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి.. ఇప్పుడు ఆ హామీ గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. మాటలు చెప్పడం కాదని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని హితవు పలికారు.

నెల మొదట్లో జీతాలేవి?

ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు నెలనెలా జీతాలు అందకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందాల్సిన ఉద్యోగులు 15వ తేదీ వచ్చినా వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఒక్కోసారి రెండు, మూడు నెలలపాటు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు : శ్రీధర్ బాబు



హైదరాబాద్: సింగరేణి సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సింగరేణి సంస్థపై బిఆర్ఎస్ నేతలు అనవసర ఆరోపణలు చేస్తూ, సంస్థకు చెడ్డపేరు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా సిఎల్పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి సంస్థను కాపాడింది గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలియజేశారు. సంస్థకు బకాయిలు పెట్టింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం సింగరేణి సంస్థను జేబు సంస్థగా మార్చుకుందని విమర్శించారు. బిఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని శ్రీధర్ బాబు అన్నారు.కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడే హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు సింగరేణి సంస్థను ఎటిఎంలా వాడుకున్నారని ధ్వజమెత్తారు. సింగరేణి సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయబోమని, ఎవరినీ చేయనివ్వబోమని తేల్చిచెప్పారు. ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. అలాగే, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. దుష్ప్రచారం ద్వారా సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయాలని బిఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని శ్రీధర్ బాబు ఆరోపించారు.



సంపాదకీయం

శుక్రవారం 16-10-2026

సరళికరణ మార్గంలో ముందడుగు

నిరుడు జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశం పన్నురేట్ల తగ్గింపు, హేతుబద్ధీకరణలకు ప్రాధాన్యమిచ్చింది. ఆ నిర్ణయాలు గతేడాది సెప్టెంబరు నుంచి అమల్లోకి వచ్చాయి. వీటికి కొనసాగింపుగా ఇటీవల దిల్లీలో జీఎస్టీ మండలి 57వ భేటీ జరిగింది. ఈసారి రిజిస్ట్రేషన్లు, రిటర్నులు, రిఫండ్లు, ఎగుమతులు, వన్ను వివాదాల పరిష్కారంలో సరళీకరణకు ప్రాధాన్యమిచ్చారు. కేటరింగ్, ఇన్సూరెన్స్ వంటి కొన్ని సేవలపై ఇన్‌పుట్ ట్యాక్స్ ఇచ్చేలా నిబంధనను మార్చి, వ్యాపారులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకున్నారు. వీటి అమలుకు నోటిఫికేషన్లు జారీ చేయడంతోపాటు జీఎస్టీ నిబంధనలు, చట్టంలో మార్పులు చేయాల్సి ఉంది. శాశ్వత వ్యాపార ప్రాంగణాలు లేని చిన్న వ్యాపారులు ఈ-కామర్స్ సంస్థల ద్వారా వివిధ రాష్ట్రాల్లో వస్తువులు విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయాలని జీఎస్టీ మండలి తాజా సమావేశం సిఫార్సు చేసింది. ఇందులో భాగంగా ఈ-కామర్స్ గోదాములనే ప్రధాన వ్యాపార కేంద్రంగా పరిగణించి రిజిస్ట్రేషన్ పొందే అవకాశం కల్పించనున్నారు. దీనివల్ల చిన్న వికేతలకు ప్రయోజనం చేకూరడంతోపాటు ఆన్‌లైన్ వ్యాపారాన్ని విస్తరించుకునే అవకాశమూ ఉంటుంది. ఏడాదికి రూ. 5 కోట్ల వరకు టర్నోవర్ కలిగిన 'నేరుగా వినియోగదారులకు విక్రయించే(బీ2సీ) వ్యాపారులు' మూడు నెలలకోసారి పన్ను చెల్లించి, ఏడాదికోసారి రిటర్ను దాఖలుచేసే ఐచ్ఛిక విధానాన్ని కూడా జీఎస్టీ మండలి సూత్రప్రాయంగా ఆమోదించింది. ఇది అమల్లోకి వస్తే, దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 16లక్షల మంది చిరు వ్యాపారులకు రిటర్నుల దాఖలు, పన్ను నిబంధనల పాటింపులో వెసులుబాటు కలుగుతుంది. నిర్వహణ భారమూ తగ్గుతుంది.

తనిఖీలు తగ్గుముఖం పడతాయా?

వ్యాపారంలో పన్నులు చెల్లించడం ఎంత ముఖ్యమో, ప్రభుత్వం నుంచి ట్యాక్స్ రిఫండ్లను పొందడమూ అంతే కీలకం. కాబట్టి, రిఫండ్లను త్వరగా మంజూరు చేసేలా మరో కీలక ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఎగుమతులు, ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ కింద అర్హమైన రిఫండ్ క్లెయిముల్లో 90శాతం మొత్తాన్ని... అధికారుల ప్రమేయం లేకుండా, సిస్టమ్ ద్వారా 'ప్రొవిజనల్'గా మంజూరు చేయాలని సిఫారసు చేశారు. దీనివల్ల వ్యాపారులకు నిధులు త్వరగా అందుబాటులోకి వచ్చి, పెట్టుబడులకు కొరత లేకుండా ఉంటుంది. అయితే, ఈ వెసులుబాటును అక్రమార్కులు దుర్వినియోగం చేయకుండా చూడాలి. బోగస్ ఇన్వాయిస్‌లతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొంది, అక్రమంగా రిఫండ్లు తీసుకునే మోసాలను అరికట్టాలి. ఇందుకోసం పటిష్ఠ డేటా విశ్లేషణ, రిస్క్ ఆధారిత తనిఖీలు అవసరం. రిజిస్ట్రేషన్లు ఇచ్చే సమయంలోనూ జాగ్రత్త వహించాలి. నిజాయతీగా వ్యాపారం చేసేవారికి సత్వర సేవలు అందించాలి. అదే సమయంలో మోసగాళ్లకు ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టే అవకాశం ఇవ్వకుండా అధికారులు సదా అప్రమత్తంగా ఉండాలి. దిల్లీ భేటీలో సేవల ఎగుమతులను ప్రోత్సహించే నిర్ణయాలు కూడా తీసుకున్నారు. విదేశాల్లోని శాఖల ద్వారా భారతీయ సంస్థలు అందించే సేవలను 'ఎగుమతి సేవలు'గా పరిగణించేలా మార్పులు చేయాలని కౌన్సిల్ సిఫార్సు చేసింది. విదేశ మారకద్రవ్యాన్ని ఆర్జించడంలో సేవల ఎగుమతులదే కీలక పాత్ర. కాబట్టి, ఈ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశార్థికానికీ, కంపెనీలకూ మేలు జరుగుతుంది. రవాణా రంగానికి ఊరటనిచ్చే ప్రతిపాదన కూడా ఒకటి ముందుకొచ్చింది. సరకులను తీసుకెళ్లే వాహనాలను తనిఖీ చేసే విషయంలో అధికారుల జోక్యాన్ని తగ్గించేలా నిబంధనలను మార్చాలని కౌన్సిల్ సిఫారసు చేసింది. పన్ను ఎగవేతకు సంబంధించి నిర్దిష్ట సమాచారం ఉండి, జాయింట్ కమిషనర్ స్థాయి అధికారి అనుమతి ఇచ్చినప్పుడు మాత్రమే సరఫరాదారు లేదా సరకులు అందుకునే వ్యక్తి ఉన్న రాష్ట్రంలో తనిఖీలు చేపట్టాలన్నది ప్రతిపాదన. రవాణా మార్గంలోని ఇతర రాష్ట్రాల్లో వాహనాలను అనవసరంగా ఆపకూడదన్నది దీని ఉద్దేశం. ఈ మార్పు అమల్లోకి వస్తే రవాణాదారుల ఇబ్బందులు తగ్గి, సరకులు త్వరగా గమ్యస్థానాలకు చేరతాయి. ఇక జాతీయ రహదారులపై టోల్ వసూలు హక్కు కోసం ఎన్‌హెచ్ఏఐ లేదా ఇతర ప్రభుత్వ సంస్థలకు ముందుగా చెల్లించే మొత్తంపై జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలన్నది మరో ప్రతిపాదన. దీనివల్ల ఆ హక్కు పొందే సంస్థలపై పన్ను భారం తగ్గి, ప్రయాణికులకూ మేలు జరుగుతుంది.

వేధింపుల నుంచి రక్షణ కోసం...

ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అక్రమార్కుల విచారణకు సంబంధించిన పన్ను పరిమితిని రూ.కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచాలనీ, జీఎస్టీ కింద అరెస్టుకు సంబంధించిన నిబంధనలను పూర్తిగా తొలగించాలని కౌన్సిల్ సూచించింది. ఇటువంటి మార్పులతో... సకాలంలో పన్నులు చెల్లించలేక, ఆలస్యమైన కాలానికి వడ్డీతోపాటు చెల్లింపులు జరిపే సాధారణ వ్యాపారులకు అనవసర వేధింపులు, క్రిమినల్ చర్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే, ప్రాసిక్యూషన్ పరిమితి పెంపు బిల్ ట్రేడర్లకు రక్షణగా మారకూడదు. వాస్తవంగా సరకుల రవాణా జరగకపోయినా నకిలీ ఇన్‌వాయిస్‌లతో ఐటీసీ పొందడం, ఇతరులకు బదిలీ చేయడం వంటి మోసాలను అడ్డుకోవాలి. ప్రస్తుతం ఇటువంటి అక్రమాలకు వర్తించే 100శాతం పెనాల్టీని పెంచే అంశాన్ని పరిశీలించాలి. సాధారణ వ్యాపారులకు వెసులుబాటు కల్పిస్తూనే... ప్రభుత్వ సొమ్మును అక్రమంగా రిఫండ్ తీసుకునే వారినీ 'బిల్ ట్రేడింగ్' ద్వారా సర్కారీ ఆదాయానికి గండికొట్టే వారినీ కఠినంగా దండించాలి. కొన్ని వస్తువులు, సేవలపై జీఎస్టీ వర్తింపునకు సంబంధించిన సందేహాలను సర్క్యులర్ల ద్వారా నివృత్తి చేయాలని మండలి సిఫార్సు చేసింది. ఈ సిఫార్సుల అమలు కోసం చట్టంలోని పలు సెక్షన్లు, నిబంధనలను సవరించాలి. ఇందుకు చట్టసభల ఆమోదం పొందాల్సి ఉంటుంది కాబట్టి, మరికొంత సమయం పడుతుంది. ఏతావాతా పన్ను విధానాన్ని సరళీకరించడం ఎంత అవసరమో... రిజిస్ట్రేషన్లు, రిఫండ్ల దుర్వినియోగాన్ని అరికట్టడమూ అంతే ముఖ్యం. నిజాయతీగా వ్యాపారం చేసేవారికి అండగా ఉంటూ, అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా సంస్కరణలు అమలైతేనే ఆశించిన ఫలితాలు వస్తాయి.


రష్యా డీజిల్‌పై ట్రంప్ ద్వంద్వనీతి



వాషింగ్టన్,అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు, శాశ్వత శత్రువులు ఉండరు.. శాశ్వతంగా ఉండేది జాతీయ ప్రయోజనాలే అనే మాట మరోసారి నిజమవుతోంది. ప్రపంచానికి ప్రజాస్వామ్యం, న్యాయం, అంతర్జాతీయ నియమాల గురించి ఉపన్యాసాలు ఇచ్చే అగ్రరాజ్యం అమెరికా, తన ఆర్థిక ప్రయోజనాల విషయానికి వచ్చేసరికి అదే నియమాలను ఎలా పక్కన పెడుతుందో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తీసుకున్న రష్యా డీజిల్ కొనుగోలు నిర్ణయం స్పష్టం చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై సుంకాల భారం మోపుతూ, ఆ దేశానికి ఆర్థికంగా సహకరిస్తున్నారంటూ విమర్శలు చేసిన ట్రంప్.. ఇప్పుడు తన దేశ అవసరాల కోసం అదే రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకోవడానికి సిద్ధపడటం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.అమెరికా తన ప్రయోజనాల కోసం తీసుకున్న ఈ నిర్ణయం భారత్ విషయంలో అనుసరించిన ద్వంద్వ వైఖరిని ప్రపంచం ముందు నిలబెట్టింది. రష్యా ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో రష్యా ఆదాయాన్ని తగ్గించడం ద్వారా ఆ దేశ యుద్ధ సామర్థ్యాన్ని దెబ్బతీయాలన్నది అమెరికా సహా పాశ్చాత్య దేశాల ఆంక్షల ప్రధాన ఉద్దేశం. ఈక్రమంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై కూడా అమెరికా ఒత్తిడి పెంచింది. ముఖ్యంగా భారత్ రష్యా నుంచి తక్కువ ధరకు ముడిచమురు కొనుగోలు చేయడాన్ని ట్రంప్ ప్రభుత్వం తప్పుబట్టింది. భారత్‌పై అదనపు సుంకాలు విధించడంతోపాటు, రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేసే దేశాలపై మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామనే హెచ్చరికలు చేసింది. భారత్ తన ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాన్ని కూడా అమెరికా రాజకీయ ఒత్తిడికి ఒక సాధనంగా ఉపయోగించుకుంది.అయితే, ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. అమెరికాలో ఇంధన ధరలు పెరగడం, దేశీయంగా ప్రజలపై పడుతున్న ఆర్థిక భారం, రాబోయే మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి వంటి అంశాల మధ్య ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో డీజిల్ సరఫరా ఒప్పందాన్ని ప్రకటించారు. అక్టోబర్ 9న వెలువడిన ప్రకటన ప్రకారం, రష్యా నుంచి డీజిల్ సరఫరాలను ప్రారంభించి, తదుపరి దశల్లో వాటిని పెంచే ప్రణాళికను ట్రంప్ వెల్లడించారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా అమెరికా ఆర్థిక శాఖ కూడా రష్యా డీజిల్‌కు సంబంధించిన కొన్ని లావాదేవీలకు పరిమిత కాలానికి అనుమతినిచ్చింది. అయితే ప్రకటించిన సరఫరాలన్నీ పూర్తిగా అమలవుతాయా, అవి అమెరికా మార్కెట్‌లో ధరలను ఎంతవరకు తగ్గిస్తాయా అన్నది ఇంకా తేలాల్సి ఉంది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. అమెరికాకు ఇంధనం అవసరమైనప్పుడు రష్యా నుంచి డీజిల్ కొనుగోలు చేయడం జాతీయ ప్రయోజనమైతే, భారత్ తన ఇంధన అవసరాల కోసం రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం తప్పెలా అవుతుంది? అమెరికా ప్రజలపై ధరల భారం పడకూడదని ట్రంప్ భావించడం సమంజసమే. కానీ అదే ఆర్థిక తర్కాన్ని భారత్ అనుసరించినప్పుడు దానిని తప్పుబట్టడం ఏ విధంగా న్యాయబద్ధమవుతుంది? అమెరికాకు ఒక న్యాయం, భారత్‌కు మరో న్యాయం ఉండాలా? ఈ ప్రశ్నకు ట్రంప్ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన వినియోగదారులలో ఒకటి. దేశీయ అవసరాలకు సరిపడా ముడిచమురును ఉత్పత్తి చేసుకోలేకపోవడంతో, దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. దాని ప్రభావం సామాన్య ప్రజల కుటుంబ బడ్జెట్‌పై పడుతుంది. వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక రంగాలపై ఇంధన ధరల ప్రభావం ఉంటుంది. అందువల్ల తక్కువ ధరకు లభించే ముడిచమురును కొనుగోలు చేయడం భారత్‌కు కేవలం వాణిజ్య నిర్ణయం మాత్రమే కాదు; దేశ ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన అంశం కూడా. రష్యా– ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో చోటుచేసుకున్న మార్పులను భారత్ తనకు అనుకూలంగా ఉపయోగించుకుంది. రష్యా నుంచి రాయితీ ధరలకు ముడిచమురును కొనుగోలు చేయడం ద్వారా దిగుమతి ఖర్చులను నియంత్రించేందుకు ప్రయత్నించింది. ఇది భారత ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయం. ఒక దేశం తన ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు ఇంధనాన్ని సమకూర్చుకోవాలనుకోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన ఆలోచన కాదు. అంతేకాకుండా, భారత్ తన విదేశాంగ విధానంలో వ్యూహాత్మక స్వతంత్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. అమెరికాతో సంబంధాలను కొనసాగిస్తూనే రష్యాతోనూ సంబంధాలను కాపాడుకోవాలనే వైఖరి దశాబ్దాలుగా భారత దౌత్య విధానంలో భాగంగా ఉంది.అయినప్పటికీ, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో అమెరికా అదనపు సుంకాలు విధించడం, మరిన్ని ఆంక్షలు విధిస్తామని హెచ్చరించడం అంతర్జాతీయ వాణిజ్యంలో సమానత్వ సూత్రంపై సందేహాలు కలిగించింది. ఇప్పుడు అమెరికా కూడా రష్యా నుంచి డీజిల్ కొనుగోలుకు సిద్ధపడటంతో ఆ సందేహాలు మరింత బలవడ్డాయి. అమెరికా తన అవసరాల కోసం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, భారత్‌కు మాత్రం అలాంటి నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ లేదన్నట్లుగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. అయితే, ఈ వ్యవహారాన్ని కేవలం వ్యక్తిగత రాజకీయ విమర్శలకు పరిమితం చేయకూడదు. దేశాల ఇంధన అవసరాలు, దిగుమతి చేసుకునే ఇంధన రకం, ఆంక్షల పరిధి, ఒప్పందాల నిబంధనలు వేర్వేరుగా ఉండవచ్చు. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయడం, రష్యాలో ఉత్పత్తి చేసిన డీజిల్‌ను దిగుమతి చేసుకోవడం రెండూ ఒకే రకమైన వాణిజ్య లావాదేవీలు కావు.ట్రంప్ నిర్ణయం వెనుక దేశీయ రాజకీయాల ప్రభావాన్ని కూడా విస్మరించలేం. అమెరికాలో ఇంధన ధరలు పెరగడం పాలక ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారవచ్చు. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ధరల నియంత్రణ ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేసే అంశం. ప్రజలకు తక్కువ ధరలకు ఇంధనం అందించగలిగితే రాజకీయంగా ప్రయోజనం కలుగుతుందని పాలకులు భావించడం సహజం. అందుకే రష్యాతో సంబంధాల విషయంలో గతంలో అనుసరించిన కఠిన వైఖరిని సడలించేందుకు ట్రంప్ సిద్ధపడినట్లు కనిపిస్తోంది.

సౌదీ ఇంజినీర్ అరెస్ట్! అమెరికాలో సంచలనం...

వాషింగ్టన్, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ఆధిపత్యం కోసం పోటీ తీవ్రంగా సాగుతున్న వేళ.. అమెరికాలోని ప్రముఖ ఏఐ సంస్థ ఓపెన్‌ఏఐలో గూఢచర్యం ఆరోపణలు కలకలం రేపాయి. సంస్థ కార్యాలయంలోని కీలక సమావేశాల గదిలో రహస్యంగా వినికిడి పరికరం ఏర్పాటు చేశారన్న ఆరోపణలపై సౌదీ అరేబియాకు చెందిన ఓ ఇంజినీర్‌ను అమెరికా అధికారులు అరెస్టు చేశారు. అత్యాధునిక ఏఐ సాంకేతికతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని అక్రమంగా సేకరించేందుకు ఈ పరికరాన్ని ఉపయోగించినట్లు ప్రాసిక్యూటర్లు ఆరోపిస్తున్నారు.అమెరికా న్యాయశాఖ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. 35 ఏళ్ల అబ్దుల్‌రహ్మాన్ అల్‌ఫోజాన్ 2025 జూలై నుంచి ఓపెన్‌ఏఐలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనపై ఎలక్ట్రానిక్ లేదా ఇతర పరికరాల ద్వారా సంభాషణలను అక్రమంగా వినేందుకు ప్రయత్నించారన్న అభియోగం నమోదైంది. మంగళవారమే ఆయన తొలిసారి కోర్టు ముందు హాజరయ్యారు.ఈ కేసులో నేరం రుజువైతే గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్షతో పాటు 2.5 లక్షల డాలర్ల జరిమానా విధించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.అమెరికా న్యాయశాఖ దాఖలు చేసిన ఫిర్యాదు ప్రకారం.. ఓపెన్‌ఏఐ కార్యాలయంలోని ఎగ్జిక్యూటివ్ కాన్ఫరెన్స్ రూమ్‌లో వినికిడి పరికరాన్ని అత్యంత రహస్యంగా అమర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. టిష్యూ పేపర్‌లో దాచిన ఈ పరికరాన్ని సెప్టెంబర్ 28 ప్రాంతంలో ఏర్పాటు చేసినట్లు, సెప్టెంబర్ 30న గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.సంస్థ కార్యాలయంలోని వీడియో నిఘా దృశ్యాలను పరిశీలించినప్పుడు.. అల్‌ఫోజాన్ పలు తేదీల్లో ఆ సమావేశాల గది సమీపంలో కనిపించినట్లు ప్రాసిక్యూటర్లు తెలిపారు. అయితే, ఆ గదిలోకి ప్రవేశించేందుకు లేదా అక్కడ జరిగే సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయనకు అధికారిక అనుమతి లేదని పేర్కొన్నారు.ఆ గదిలో జరిగే సమావేశాలు అత్యంత గోప్యమైనవని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో అక్కడ పరికరం ఏర్పాటు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోంది.



బ్యాగులో మరో పరికరం.. సంస్థ అప్రమత్తం

కాన్ఫరెన్స్ రూమ్‌లో పరికరం బయటపడిన తర్వాత ఓపెన్‌ఏఐ భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో అల్‌ఫోజాన్ బ్యాగులో మరో వినికిడి పరికరాన్ని గుర్తించినట్లు నివేదికలు వెల్లడించాయి.ఈ పరిణామం సంస్థలో భద్రతా చర్యలపై ప్రశ్నలు లేవనెత్తింది. అత్యంత విలువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్న సంస్థల్లో అంతర్గత భద్రత, రహస్య సమాచారం రక్షణ ఎంత కీలకమో ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.అయితే, పరికరాల ద్వారా ఎలాంటి సమాచారాన్ని సేకరించారన్నది ఇంకా స్పష్టంగా వెల్లడికాలేదు. నిందితుడిపై వచ్చిన ఆరోపణలు కోర్టులో నిరూపించాల్సి ఉంది.

'మోడల్ వెయిట్స్, సోర్స్ కోడ్ చోరీకి ఆధారాల్లేవు'

ఈ ఘటనపై ఓపెన్‌ఏఐ స్పందిస్తూ.. నిందితుడు తమ ఏఐ మోడళ్ల అంతర్గత వెయిట్స్, సోర్స్ కోడ్ లేదా వినియోగదారుల డేటాను అనధికారికంగా యాక్సెస్ చేసినట్లు, బయటకు తరలించినట్లు ప్రస్తుతానికి ఎలాంటి ఆధారాలు లేవని తెలిపింది. సంబంధిత ఉద్యోగిని విధుల నుంచి తొలగించినట్లు ప్రకటించింది. మరో ముఖ్యమైన విషయాన్ని కూడా సంస్థ వెల్లడించింది. వినికిడి పరికరం స్వరూపం, అది ఎక్కడి నుంచి వచ్చిందన్న అంశాలను అర్థం చేసుకోవడానికి తమ ఏఐ మోడళ్లను ఉపయోగించినట్లు పేర్కొంది. ఆ విశ్లేషణ ద్వారా కొద్ది రోజుల ముందే ఓ నిర్దిష్ట ఉద్యోగి పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తించామని తెలిపింది.

ఏఐ రంగంలో గూఢచర్య భయాలు

ప్రపంచవ్యాప్తంగా ఏఐ సాంకేతికతలో ఆధిపత్యం సాధించేందుకు సంస్థలు, దేశాల మధ్య పోటీ పెరుగుతోంది. అధునాతన ఏఐ మోడళ్లు, వాటికి శిక్షణ ఇచ్చే విధానాలు, కంప్యూటింగ్ వనరులు, పరిశోధన వివరాలు.. ఇవన్నీ వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఈ నేపథ్యంలో అత్యంత గోప్యమైన సమావేశాలపై నిఘా పెట్టేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు సాంకేతిక రంగంలో ఆందోళనకు కారణమయ్యాయి. మేధో సంపత్తి చోరీ, రహస్య సమాచారం సేకరణ, అంతర్గత ఉద్యోగుల ద్వారా జరిగే భద్రతా ఉల్లంఘనలు వంటి అంశాలు ఏఐ సంస్థలకు పెద్ద సవాలుగా మారుతున్నాయి.అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ ఈ కేసును అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక సూపర్ ఇంటెలిజెన్స్ సాంకేతికతకు సంబంధించిన మేధో సంపత్తి చోరీ జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తుందని వ్యాఖ్యానించారు.ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ కూడా అమెరికా సాంకేతిక ఆవిష్కరణలను రక్షించడం దేశ ఆర్థిక బలం, జాతీయ భద్రతకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ లక్ష్యం తమ ప్రతినిధూ కార్యకలాపాల్లో అత్యున్నత ప్రాధాన్యాల్లో ఒకటని స్పష్టం చేశారు.

ఏఐతోనే ఏఐ ముప్పును గుర్తించారా?

ఈ ఘటనలో మరో ఆసక్తికర అంశం ఉంది. రహస్య పరికరాన్ని ఏర్పాటు చేసిన వ్యక్తిని గుర్తించేందుకు ఓపెన్‌ఏఐ తన ఏఐ మోడళ్లనే ఉపయోగించినట్లు ప్రకటించింది. పరికరం స్వరూపం, దాని మూలం, దాన్ని ఏర్పాటు చేసిన వ్యక్తి గురించి విశ్లేషణ చేపట్టినట్లు తెలిపింది. ఏఐ విశ్లేషణ ఆధారంగా గుర్తించిన వివరాలు ఎలా ధ్రువీకరించబడ్డాయి, వాటికి సంబంధించి ఎలాంటి అదనపు ఆధారాలు సేకరించారు అనే అంశాలపై పూర్తి వివరాలు ఇంకా వెలువడలేదు. తుది నిర్ధారణ దర్యాప్తు, న్యాయ ప్రక్రియ ఆధారంగానే జరగాల్సి ఉంటుంది.మొత్తంగా.. ఓపెన్‌ఏఐ కార్యాలయంలో వినికిడి పరికరాల గుర్తింపు, ఉద్యోగిపై వచ్చిన ఆరోపణలు ఏఐ రంగంలో అంతర్గత భద్రత ప్రాధాన్యాన్ని మరోసారి తెరపైకి తెచ్చాయి. అయితే, కీలక సాంకేతిక సమాచారాన్ని చోరీ చేశారన్నది ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు. ఎఫ్‌బీఐ దర్యాప్తు, కోర్టు విచారణలో వెలువడే వివరాలే ఈ వ్యవహారంలో అసలు వాస్తవాలను తేల్చనున్నాయి.

మనమిత్ర ద్వారా కుల ధృవీకరణ పత్రాలు..

విజయవాడ , ఏపీ ప్రభుత్వం చాలా పనులను ఆన్‌లైన్ ద్వారా చేసుకునే వెసులుబాటు కల్పించింది. తాజాగా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తమ కుల ధృవీకరణ పత్రాలు పొందే సదుపాయాన్ని కల్పించినట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ అధికారులు తెలిపారు. పౌరులు తమ కుల ధృవీకరణ పత్రాలకు కావాల్సినప్పుడు ఏ ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లనవసరం లేదు. తాము ఉన్న చోటు నుంచే తమ మొబైల్‌ఫోన్ ద్వారా డౌన్‌లోడు చేసుకోవచ్చని ఆర్టీజీఎస్ రాష్ట్ర ప్రజలకు సూచించింది. మనమిత్రలోని రెవెన్యూ సేవల విభాగంలో పౌరులు రీ ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ సెక్షన్ ఎంపిక చేసుకోవాలి. అందులో తమ ఆధార్ నంబరు ఎంటర్ చేసి, దాంతో ఓటీపీ పొందాలి. ఈ ఓటీపి అందులో నమోదు చేసిన తర్వాత కొన్ని వివరాలను మీరు ఫిల్ చేయాలి. తర్వాత మీరు క్యాస్ట్ సర్టిఫికెట్ పొందడానికి కావాల్సిన 40 రూపాయలు రుసుమును వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే చెల్లించాలి. ఒకసారి చెల్లింపు అయిన తర్వాత వాట్సాప్‌లో మీ కుల ధృవీకరణ పత్రం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే కులానికి సంబంధించిన పత్రాలు జారీ అయిన వారు తమ సర్టిఫికెట్లను వాట్సాప్ ద్వారా తమకు కావాల్సిన సమయంలో కావాల్సినప్పుడు డౌన్లోడు చేసుకోవచ్చు. ప్రతిసారి కుల ధృవీకరణ పత్రాల కోసం రెవెన్యూ ఆఫీసులు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ సదుపాయం ఇప్పటికే క్యాస్ట్ సర్టిఫికెట్ పొందినవారికి కల్పిస్తున్నామని.. త్వరలో మనమిత్ర ద్వారా కొత్తగా కుల ధృవీకరణకు అప్లై చేసుకుని పొందే సదుపాయం కూడా కల్పించనున్నట్లు ఆర్టీజీఎస్ ఓ ప్రకటనలో తెలిపింది. మీరు ఏపీ పౌరుడు అయితే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 కు ఊతి (హాయ్) అని మెసేజ్ పంపాలి మీకు కావాల్సిన సర్వీసును ఎంచుకోవడం ఆప్షన్ పైన క్లిక్ చేయండి ఆ తరువాత రెవెన్యూ సేవల ఆప్షన్ ఎంపిక చేసుకోవాలిరీ-ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు ఆప్షన్ మీరు సెలక్ట్ చేసుకోవాలి మీ ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి. మీ మొబైల్ కు ఓటీపీ వస్తుంది.మీ రిజిస్టర్ అయిన మొబైల్‌కు వచ్చిన ఓటీపీని అడిగిన చోట టైపు చేయాలి ఆధార్ డెమోగ్రాఫిక్స్ రివ్యూలో అడిగిన వివరాలన్నీ నమోదు చేయాలి కుల ధృవీకరణ పత్రం పొందడానికి రూ.40 చెల్లించాలి ఈ నగదు చెల్లించడానికి ఉన్న పేమెంట్ గేట్ వే ద్వారా మాత్రమే మీరు చెల్లించాలి: మీ కుల ధృవీకరణ పత్రం పీడీఎఫ్ డౌన్ లోడ్ అని వస్తుంది: మీ అజీబవిన అవతీబితితిఇజీవిన మీరు ప్రింట్ ఔట్ తీసుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

విశాఖ మేయర్ పీఠంపై తెర పైకి బాలయ్య కూతురి పేరు

విశాఖపట్నం,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం మేయర్ పదవికి ప్రత్యేక గుర్తింపు ఉంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నగర ప్రాధాన్యం, భారీ బడ్జెట్ కారణంగా ఈ పదవిని దక్కించుకోవాలని రాజకీయ నాయకులు ఆసక్తి చూపుతుంటారు. తాజాగా మేయర్ పదవికి మహిళా రిజర్వేషన్ ఖరారైనట్లు ప్రచారం జరగడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అధికార కూటమితో పాటు వైఎస్సార్‌సీపీ కూడా బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ముఖ్యంగా టీడీపీకి చెందిన ప్రముఖ కుటుంబాల మహిళల పేర్లు తెరపైకి రావడం ఆసక్తిని పెంచుతోంది.విశాఖ మేయర్ పదవి మరోసారి మహిళకు దక్కనుండటంతో మహిళా నాయకుల మధ్య పోటీ పెరిగే అవకాశం కనిపిస్తోంది. 2021లో జరిగిన మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున బీసీ వర్గానికి చెందిన గొలగాని హరి వెంకట కుమారి బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కూడా మహిళా అభ్యర్థికే అవకాశం ఉండటంతో పార్టీలు సామాజిక సమీకరణాలు, రాజకీయ బలాబలాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.ఈ క్రమంలో నందమూరి తేజస్విని పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమె సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె. విశాఖపట్నం

ట్వీట్లతో పాటీ... లెక్క తేల్చేస్తున్న పెద్దలు

విజయవాడ ,ఆంధ్రప్రదేశ్‌లో అధికార ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు , పవన్ కల్యాణ్ పరిపాలనాపరంగా ఎలాంటి విభేదాలు లేకపోయినా.. క్షేత్రస్థాయిని శాసించే సోషల్ మీడియా వేదికలపై మాత్రం నిత్యం అగ్గి రాజేస్తూనే ఉంది. ఇరు పార్టీల అధినేతలు భేటీ అవుతూ సమన్వయంతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నప్పటికీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో రెండు పార్టీల కార్యకర్తలు, సానుభూతిపరులు పరస్పరం చేసుకుంటున్న విమర్శలు తారాస్థాయికి చేరుతున్నాయి.పవన్ కల్యాణ్ ఏదైనా వ్యాఖ్య చేసిన తర్వాత టీడీపీ సోషల్ మీడియా విభాగాలు భావోద్వేగాలతో రియాక్ట్ కావడం, దానికి ప్రతిగా జనసేన సైనికులు గత త్యాగాలను గుర్తుచేస్తూ విరుచుకుపడటం పరిపాటిగా మారింది. అటు కాకినాడ, పిఠాపురం నుంచి మొదలుకొని విశాఖ పెందుర్తి వంటి చోట్ల వరకు ఫ్లెక్సీల వివాదాలు, స్థానిక ఆధిపత్య పోరును సోషల్ మీడియా వేదికలకు ఎక్కించి ట్రోలింగ్ వార్ నడుపుతున్నారు. నాయకత్వం చెప్పే విధానపరమైన ప్రకటనల కంటే.. యూట్యూబ్ తంబ్‌నెయిల్స్, సోషల్ మీడియా రీల్స్‌లోని కట్ క్లిప్పింగులకే కార్యకర్తలు ప్రాధాన్యతనిస్తూ ఒకరినొకరు కించపరుచుకునే స్థాయికి దిగజారుతున్నారు.ఇదే సమయంలో రాబోయే స్థానిక సంస్థల సమరానికి సంబంధించి సీట్ల పంపకాల లెక్కలను పార్టీ పెద్దల కంటే ముందే ఈ కీబోర్డ్ వారియర్స్ తేల్చేస్తుండటం మరింత హాస్యాస్పదంగా మారింది. 17 కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీల రిజర్వేషన్లు ఖరారైన వేళ.. ఏ సీటు తమకే దక్కాలి, ఎవరు ఎక్కడ త్యాగం చేయాలనే దానిపై సోషల్ మీడియాలోనే ఎవరికి వారే జాబితాలు విడుదల చేసుకుంటున్నారు. విజయవాడ, విశాఖ, కాకినాడ మేయర్ సీట్లతో పాటు కీలక మున్సిపాలిటీలను జనసేనకే ఇవ్వాలని కొందరు, టీడీపీ సంప్రదాయ ఓటు బ్యాంకు ప్రకారం మెజారిటీ స్థానాలు తమకే ఉండాలని మరికొందరు సొంత సిద్ధాంతాలు వండి వారుస్తున్నారు. పెద్దలు కూర్చుని ఒక ఒప్పందానికి వస్తారన్న కనీస ఇంగితం లేకుండా.. ఎవరికి ఎన్ని సీట్లు కేటాయించాలన్న దానిపై వీరే లెక్కలు కడుతూ కూటమి మైత్రిని విషమించేలా చేస్తున్నారు.ఈ తరహా వర్గపోరు అంతిమంగా ప్రతిపక్షానికి రాజకీయ అస్త్రంగా మారుతుందన్న స్పృహ కేడర్‌లో లోపిస్తోంది. పార్టీల అధిష్ఠానాలు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, ఫేక్ అకౌంట్ల ప్రచారాలను నమ్మవద్దని హెచ్చరించినా.. సోషల్ మీడియాలో ముఠా కక్షల తరహాలో సాగుతున్న ఈ డిజిటల్ వార్ ఆగడం లేదు. ఒకవైపు నాయకులు ఐక్యతను ప్రదర్శిస్తుంటే, మరోవైపు కార్యకర్తలు ఇలా కయ్యానికి కాలుదువ్వడం కూటమి క్షేత్రస్థాయి ఓటు బదిలీపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదముంది.

ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి

మెదక్ ,ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భ జలాల లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగు, విత్తనాల సరఫరా, వ్యవసాయ, విద్యుత్తు, మంచినీటి తదితర రంగాలపై ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సీజన్‌తో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైనట్లు వివరించారు. ఎల్ నినో వల్ల భూగర్భ జలాలు, చెరువులు, ఇతర నీటి వనరులపై ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులు వరి సాగుపైనే ఆధారపడకుండా కంది, మొక్కజొన్న, పెసలు, మినుములు, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు చిరుధాన్యాల సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. పంటల సాగులో వైవిధ్యీకరణ ద్వారా తక్కువ నీటి వినియోగంతో మెరుగైన ఆదాయం పొందే అవకాశాలను రైతులకు వివరించాలన్నారు.వరి సాగు వల్ల కలిగే లాభనష్టాలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మద్దతు ధరలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. కంది, పెసర, మినుము, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పంటల విత్తనాలకు సంబంధించి సబ్సిడీ వివరాలతో కూడిన సమగ్ర ప్రొఫార్మాను సిద్ధం చేయాలన్నారు.మండలాలు, గ్రామాల వారీగా రైతుల నుంచి విత్తనాల డిమాండ్‌ను సేకరించి, అవసరమైన విత్తనాల కొరకు ప్రతిపాదనలను తక్షణమే సమర్పించాలని సూచించారు.జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో అమలు చేయాల్సిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రాబోయే రెండు రోజుల్లోగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, నీటిపారుదల తదితర శాఖలు తమ పరిధిలోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చర్యలతో నివేదికలు అందించాలన్నారు.వ్యవసాయ శాఖ నోడల్ శాఖగా వ్యవహరిస్తూ అన్ని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఏయే పంటలను కొనుగోలు చేస్తారు, వాటికి వర్తించే మద్దతు ధరలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయంతో పాటు నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలపై ప్రభావాన్ని అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వేసవిలో.మంచినీటి సమస్య రాకుండా సమ్మర్ యాక్షన్ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. రబీ సాగు కంటే ముందునుండే పంటల సాగుపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్తు, మున్సిపల్ కమిషనర్,జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ, , నీటిపారుదల డివిజన్ల ఈఈలు జిల్లా పంచాయతీ డి ఎల్ పి ఓ లు , తదితరులు పాల్గొన్నారు.

దసరా నుండి జిల్లాలో పత్తి కొనుగోలు

సిద్దిపేట,దసరా నుండి జిల్లాలో పత్తి కొనుగోలు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మీ కిరణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 9 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 23 సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని అన్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపుకు రికార్డు ధర



గుంటూరు :గుంటూరు జిల్లాలోని ప్రసిద్ధ దుగ్గిరాల యార్డులో పసుపు ధర సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం జరిగిన మార్కెట్ ట్రేడింగ్‌లో క్వింటా పసుపు గరిష్ఠంగా రూ. 18,400 పలికింది. కొమ్ములు అలాగే కాయ రకం పసుపునకు ఈ అద్భుతమైన ధర లభించింది. పసుపు మార్కెట్ చరిత్రలో ఈ స్థాయి ధర పలకడం రైతన్నలకు ఎంతో ఆనందం కలిగిస్తోంది.

కేవలం ఐదు రోజుల్లోనే భారీగా పెరిగిన ధర

గతంలో ఈ నెల 8వ తేదీన క్వింటా ధర రూ. 15,900 మాత్రమే ఉంది. కానీ కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే ధర ఏకంగా రూ. 2,500 పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు పంటకు అన్‌సీజన్ నడుస్తోంది. దీనివల్ల నిల్వ ఉన్న సరుకుకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. వ్యాపారులు పసుపు కొనుగోలు చేయడానికి పోటీ పడుతున్నారు.

దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉన్న మార్కెట్

దేశవ్యాప్తంగా పేరుగాంచిన ప్రధాన పసుపు మార్కెట్లలో దుగ్గిరాల మార్కెట్ ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లో దుగ్గిరాలతో పాటు మైదుకూరు, పాడేరు అలాగే చింతపల్లి ప్రాంతాల్లో కూడా పసుపు యార్డులు ఉన్నాయి. అయితే దుగ్గిరాల యార్డులో నమోదైన ఈ తాజా రికార్డు ధర పసుపు రైతులకు మంచి లాభాలను తెచ్చిపెడుతోంది.

ఉమ్మడి కడప జిల్లా.. వైసీపీకి అతిపెద్ద సవాల్!



కడప :ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పోరు హోరాహోరీని తలపించనుంది. ఎందుకంటే, ఇది వైఎస్ జగన్ అడ్డా. ఈ జిల్లాలో కడప మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు తొమ్మిది మున్సిపాల్టీలున్నాయి. ఇందులో వైఎస్ జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల కూడా వుండడం ఆసక్తి రేపుతోంది. వీటిలో అధికార , ప్రతిపక్ష పార్టీల బలాబలాలేంటో తెలుసుకుందాం.

కడప మున్సిపల్ కార్పొరేషన్:

ఇక్కడి నుంచి టీడీపీ ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ కార్పొరేషన్‌ను ఓసీ మహిళకు కేటాయించారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, కడప మున్సిపాల్టీ కాస్తా కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. ఇక్కడి నుంచి మొదటి మేయర్‌గా వైఎస్సార్ బామ్మర్ది పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు.వైఎస్సార్ మరణానంతరం ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల గురించి తెలిసిందే. వైఎస్ జగన్ నేతృత్వంలో వైసీపీ ఏర్పడింది. కడప కార్పొరేషన్‌లో వైసీపీనే పట్టు నిలుపుకుంటూ వచ్చింది. అయితే ఈ దఫా ఎన్నికలు మాత్రం, గతం కంటే భిన్నంగా వుంటాయా? లేక వైసీపీనే హవా కొనసాగిస్తుందా? అనే చర్చ విస్తృతంగా సాగుతోంది.టీడీపీ తరపున అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కోడలు ఉమాదేవికి మంత్రి నారా లోకేశ్ మద్దతు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె అభ్యర్థిత్వాన్ని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎమ్మెల్యే మద్దతుదారులుగా పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ తన కుమార్తెనే నిలబెట్టడానికి ఎమ్మెల్యే ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్టు సమాచారం.ఇక వైసీపీ విషయానికి వస్తే కడప మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి సతీమణి దీప్తిరెడ్డి బరిలో నిలవనున్నారు. కొంతకాలం క్రితం నిత్యానందరెడ్డి సొంత పార్టీ కార్యకర్త హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చిన సంగతి తెలిసిందే. కడపలో ఎన్నికలు సాఫీగా సాగితే వైసీపీ గెలుపు నల్లేరుపై నడకే. కానీ ఆ పరిస్థితి వుంటుందా? అనేది అనుమానమే.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ:

జిల్లాలో కడప తర్వాత ప్రొద్దుటూరు పెద్ద మున్సిపాలిటీ. ఈ మున్సిపాల్టీని జనరల్‌కు కేటాయించారు. ఇక్కడ రసవత్తర పోటీ జరగనుంది. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తమ్ముడు రాఘవరెడ్డి, అలాగే కాంట్రాక్టర్ పర్లపాడు మహేశ్‌రెడ్డి, బీసీవీఆర్ ట్రావెల్స్ అధినేత కుమారుడు సూర్యప్రతాప్‌రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.ఇదే సందర్భంలో టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్‌రెడ్డి తన సతీమణి మౌనికారెడ్డికి చైర్‌పర్సన్ పదవి ఇప్పించేందుకు సీరియస్‌గా పావులు కదుపుతున్నారు. ప్రవీణ్‌కు నారా లోకేశ్ మద్దతు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలా వుండగా రాఘవరెడ్డిని నిలపడం అన్న అయిన వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డికి ఇష్టం లేదని అంటున్నారు.వైసీపీ తరపున పోరెడ్డి నరసింహారెడ్డి లేదా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి సతీమణి రమాదేవి బరిలో నిలిచే అవకాశం వుంది. అనూహ్యంగా బీసీ అభ్యర్థిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బరిలో నిలిపేందుకు రాచమల్లు ఆలోచిస్తున్నారని అంటున్నారు. ప్రొద్దుటూరులో పోటీ నువ్వా, నేనా అన్నట్టుగా సాగనుంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఫలితాల్ని అనుకూలంగా మలుచుకునేందుకు టీడీపీ నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారనే ప్రచారం జరుగుతోంది.

పులివెందుల మున్సిపాలిటీ:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఎన్నికలు ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఈ మున్సిపాల్టీని ఓసీ మహిళకు కేటాయించారు. వైసీపీ తరపున జగన్ చిన్నాన్న వైఎస్ మనోహర్‌రెడ్డి సతీమణి బరిలో నిలవనున్నారు.టీడీపీ విషయానికి వస్తే, పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి సతీమణి లేదా తూగుట్ల మధుసూదన్‌రెడ్డి కుమార్తె బరిలో నిలిచే అవకాశం వుంది. కుప్పంలో వైసీపీ గెలుపునకు ప్రతీకారంగా పులివెందులలో ఎలాగైనా పాగా వేయాలని టీడీపీ పెద్దలు చంద్రబాబు, నారా లోకేశ్ ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది.ఎన్నికలు సజావుగా సాగితే, ఇక్కడ వైసీపీ గెలుపు గురించి ఆలోచించాల్సిన పనిలేదు. అయితే ఆ వాతావరణం కనిపించడం లేదు. ఇక్కడ ఏమవుతుందో చివరి వరకూ ఏమీ చెప్పలేని పరిస్థితి. పులివెందుల రూరల్ జెడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ దుర్మార్గంగా వ్యవహరించడంతో, ఇప్పుడు మున్సిపాల్టీలో ఏమవుతుందో అనే భయం వైసీపీని వెంటాడుతోంది.

బద్వేల్ మున్సిపాలిటీ:

బద్వేల్ మున్సిపాల్టీ పోరు ఆసక్తికరంగా మారనుంది. ఈ మున్సిపాలిటీని జనరల్‌కు కేటాయించారు. దీంతో ఇక్కడి నుంచి దివంగత బిజివేముల వీరారెడ్డి కుటుంబ సభ్యులు పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నారు. ఇటీవలే అక్కడ టీడీపీ ఇన్‌చార్జ్‌గా బిజివేముల విజయమ్మ కుమారుడు రితీష్‌రెడ్డిని తప్పించిన సంగతి తెలిసిందే. కొత్త ఇన్‌చార్జ్‌గా డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి బాధ్యతలు అప్పగించారు.విజయమ్మ కుటుంబ సభ్యులకు మున్సిపాలిటీలో స్థానం కల్పించేందుకు సూర్యనారాయణరెడ్డి ససేమిరా అంటున్నట్టు తెలిసింది. తన కుమార్తెను బరిలో నిలపాలని ఆయన ఆలోచిస్తున్నారని సమాచారం. అలాగే బోవిళ్లవారిపల్లెకు చెందిన కాంట్రాక్టర్ టీడీపీ తరపున టికెట్ ఆశిస్తున్నట్టు తెలిసింది.ఈ నియోజకవర్గంలో వైసీపీ బలంగా వుంది. గత సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలిచిన 11 స్థానాల్లో బద్వేల్ కూడా వుండడం విశేషం. డాక్టర్ సుధా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ దీసీ గోవిందరెడ్డి, డాక్టర్ సుధా మంచి అభ్యర్థుల్ని నిలిపేందుకు కసరత్తు చేస్తున్నారు.జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, బలిజ సామాజిక వర్గానికి చెందిన గురుమోహన్ టికెట్ ఆశిస్తున్నారు. గురుమోహన్ కుటుంబానికి బద్వేల్‌లో బలం వుంది. గతంలో గురుమోహన్ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయారు. గురుమోహన్ తండ్రి పరంధామయ్యకు మంచి పేరు వుంది. ఇక్కడ ఎన్నికలు సక్రమంగా జరిగితే, వైసీపీకి అనుకూలంగా ఫలితం వుంటుందనడంలో సందేహం లేదు.

మైదుకూరు మున్సిపాలిటీ:

ఇక్కడి నుంచి టీడీపీ తరపున పుట్టా సుధాకర్ యాదవ్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మున్సిపాలిటీని జనరల్‌కు కేటాయించారు. టీడీపీ తరపున చాలా మంది బలిజ నాయకులు మున్సిపల్ చైర్మన్ టికెట్ ఆశిస్తున్నారు.ఇంకా అభ్యర్థి ఖరారు కాలేదు. వైసీపీ తరపున మాధవ్ అనే బలిజ నాయకుడు టికెట్ ఆశిస్తున్నారు. అయితే ఆర్థికంగా తనకు సాయం చేస్తే, పోటీలో వుండడానికి ఇబ్బంది లేదని అంటన్నట్టు గెలిసింది. పోటీ నువ్వా, నేనా అన్నట్టుగా సాగనుంది.

రాజంపేట మున్సిపాలిటీ:

ఇక్కడి నుంచి వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కూటమి సునామీలో కూడా వైసీపీ గెలుపొందడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. టీడీపీ తరపున గంప శివ కుమార్తె బరిలో వుంటుందనే ప్రచారం సాగుతోంది. డాక్టర్ సుధాకర్ కుటుంబ సభ్యుల పేర్లు కూడా పరిశీలనలో వున్నట్టు తెలుస్తోంది.వైసీపీ తరపున ఇంకా ఎవరి పేర్లు ఖరారు కాలేదు. ప్రధానంగా డబ్బున్న అభ్యర్థుల కోసం వైసీపీ వెతుకులాడుతోంది. ఒకట్రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశం వుంది. ఎన్నికలు సజావుగా జరిగితే, ఇక్కడ వైసీపీ గెలుపు సునాయాసం.

రాయచోటి మున్సిపాలిటీ:

ఇక్కడ నుంచి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో మంత్రి ఏ రకంగా ప్రవర్తించారో అందరూ చూశారు. ఇప్పుడు రాయచోటిలో తాను ప్రాతినిధ్యం వహించే చోట వైసీపీని దెబ్బ కొట్టేందుకు పోలీస్ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో వినియోగించనున్నట్టు తెలుస్తోంది.రాయచోటి మున్సిపాలిటీని బీసీ జనరల్‌కు కేటాయించారు. టీడీపీ, వైసీపీ నుంచి పోటీ చేసేవాళ్లు ఎక్కువే. వైసీపీ తరపున షరీఫ్, బసురుల్లా, జాకీర్‌హుస్సేన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. టీడీపీ తరపున ఖాదర్‌వల్లి, మదన్‌మోహన్, గాజుల ఖాదర్‌బాషా పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికలు సక్రమంగా జరిగితే 44 వార్డుల్లో కనీసం మూడు వార్డులు కూడా టీడీపీ గెలిచే పరిస్థితి లేదు. ఎన్నికల్లో మంత్రి మార్క్ కనిపిస్తే, ఆ సంఖ్య రివర్స్ అవుతుందని వైసీపీ నేతలే చెబుతున్నారు. ఇక్కడి నుంచి వైసీపీ తరపున గడికోట శ్రీకాంత్‌రెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. అధికార పార్టీని ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

కమలాపురం మున్సిపాలిటీ:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా కొనసాగిన నియోజకవర్గం కమలాపురం. ఈ మున్సిపాలిటీని ఓసీ మహిళకు కేటాయించారు. పోటీ రసవత్తరంగా సాగనుంది. టీడీపీ ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.టీడీపీ తరపున దివాకర్‌రెడ్డి సతీమణి పోటీ చేయనున్నారు. వైసీపీ నుంచి రాజోలు వీరారెడ్డి తమ్ముడు ఆర్వీఎన్ఆర్ భార్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మార్జోళ్ల శ్రీనివాస్‌రెడ్డి కుమార్తెలలో ఎవరో ఒకరు బరిలో నిలిచే అవకాశం ఉంది. సక్రమంగా ఎన్నికలు జరిగితే, అనూహ్య ఫలితాలు వస్తాయని వైసీపీ నేతలు అంటున్నారు.

జమ్మలమడుగు మున్సిపాలిటీ:

ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ సీనియర్ నేత ఆదినారాయణరెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆది అన్న కుమారుడు భూపేష్‌రెడ్డి టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీని ఓసీ మహిళకు కేటాయించారు. ఇక్కడి నుంచి ఆదినారాయణరెడ్డి సతీమణి బీజేపీ తరపున, వైసీపీ నుంచి మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి సతీమణి ఇందిరా పోటీ చేయనున్నారు.తన నియోజకవర్గ పరిధిలోని జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీల్లో వైసీపీ కనీసం ఒక్క వార్డు గెలిచినా సరే, రాజకీయాల నుంచి నిష్క్రమిస్తానని ఆదినారాయణరెడ్డి సవాల్ విసిరారు. దీన్నిబట్టి ఎన్నికలు ఎలా జరుగుతాయో అంచనా వేసుకోవచ్చు.తమ అభ్యర్థులకు మున్సిపల్ కమిషనర్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నట్టు వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు సజావుగా సాగే పరిస్థితి లేదు. ఒకవేళ జరిగితే, వైసీపీ గెలుపు నల్లేరుపై నడకే అని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.

ఎర్రగుంట్ల మున్సిపాలిటీ:

జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎర్రగుంట్ల మున్సిపాలిటీ వుంటుంది. వైసీపీ అత్యంత బలంగా ఉన్న వాటిలో ఎర్రగుంట్ల ఒకటి. అయితే ఒక్క వార్డులో కూడా వైసీపీని గెలవనివ్వమని ఇప్పటికే ఆదినారాయణరెడ్డి హెచ్చరించారు.బీసీ మహిళకు కేటాయించిన ఈ మున్సిపాల్టీలో కూటమితో పాటు వైసీపీ నేతలు ఇంకా అభ్యర్థులను ఎంపిక చేయలేదు. ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష నాయకులు అభ్యర్థుల్ని వెతుక్కునే పనిలో వున్నాయి.వైఎస్సార్ కడప జిల్లాలో ప్రతి చోటా వైసీపీ అత్యంత బలంగా వుంది. అయితే ఎలాగైనా గెలిచి కంచుకోటలో వైసీపీకి ఏమీలేదని ప్రచారం చేయాలనే ఉత్సాహంలో టీడీపీ, బీజేపీ నేతలున్నారు. ఆ దిశగా కూటమి నేతలు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు వైసీపీకి అతిపెద్ద సవాల్ అని చెప్పక తప్పదు.ఎన్నికలు జరిగే తీరుపై ఫలితాలు ఆధారపడి వుంటాయి. ప్రతి మున్సిపాలిటీలోనూ ఎన్నికలు సక్రమంగా సాగితే మాట వినిపిస్తోంది.

ఒవైపు విద్యుత్ కొరత..

మరోవైపు అదనపు బిల్లుల భారం

హైదరాబాద్ , తెలంగాణలో విద్యుత్ సంక్షోభం, మరోవైపు ట్రూ-అప్ చార్జీల భారం రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయి. మండుతున్న ఎండలు, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగంలో పెరిగిన విద్యుత్ అవసరాలు సరఫరా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరగా, అక్కడక్కడా అప్రకటిత విద్యుత్ కోతలు, లో-వోల్టేజీ సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రూ.5,420.23 కోట్ల ట్రూ-అప్ చార్జీలను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా సవాలుగా మారింది.2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ కొనుగోళ్లు, అదనపు వ్యయాలు, ఆదాయ లోటుల సర్దుబాటులో భాగంగా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) మొత్తం రూ.7,635.22 కోట్ల ట్రూ-అప్ చార్జీల వసూలుకు అనుమతించినట్లు సమాచారం. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించనుండగా, మిగిలిన రూ.5,420.23 కోట్లను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి దశలవారీగా వసూలు చేయనున్నారు. ఇప్పటికే ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అదనపు విద్యుత్ బిల్లుల భారం మరింత భారంగా మారే అవకాశం ఉంది.విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను కొనసాగించేందుకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అవసరమైన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేయడంతో పాటు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై దృష్టి సారిస్తోంది. ఎత్తిపోతల పథకాలకు పీక్ అవర్స్‌కు బదులుగా ఆఫ్-పీక్ సమయాల్లో విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడం, నగరాల్లో సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడం, గ్రిడ్ నిర్వహణను మెరుగుపరచడం వంటి చర్యలను అమలు చేయాలని భావిస్తోంది.విద్యుత్ సమస్యలను అస్త్రంగా చేసుకుని ప్రతిపక్ష బీఆర్ఎస్ కాంగ

పులివెందులను కాపాడుకునేలా.. జగన్ కీలక నిర్ణయం



పులివెందుల:స్థానిక ఎన్నికల్లో సొంత నియోజకవర్గం పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకునేలా వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహనరెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. వైనాట్ పులివెందుల అంటూ రణనినాదం చేస్తున్న కూటమికి చెక్ చెప్పాలనే నిర్ణయంలో భాగంగా తన సొంత కుటుంబం నుంచే మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిని బరిలోకి దింపుతున్నారని చెబుతున్నారు. జగన్ బాబాయ్, పులివెందుల నియోజకవర్గ వైసీపీ వ్యవహారాలను పర్యవేక్షించే వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి ప్రమీలమ్మను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారని అంటున్నారు. ప్రమీలమ్మ గతంలోనూ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేయడం, కూటమి అభ్యర్థిని ఢీటుగా ఎదుర్కొవాలంటే తమ కుటుంబ సభ్యులే పోటీ చేయాలనే ఉద్దేశంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు.మాజీ సీఎం జగన్మోహనరెడ్డి సొంత ఇలాకాలో గెలిచి ఆయనకు షాక్ ఇవ్వాలని కూటమి పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయని అంటున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో తమకు పోటీ కూడా అవకాశం లేకుండా చేసిన చోట మున్సిపల్ చైర్ పర్సన్ పీఠం దక్కించుకోవాలని చాలా కాలంగా స్కెచ్ వేస్తున్నట్లు చెబుతున్నారు. గత ఏడాది జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో రికార్డు మెజార్టీతో గెలిచి జగన్ రెడ్డికి షాక్ ఇచ్చిన టీడీపీ, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే ఫీట్ రిపీట్ చేయాలని భావిస్తోందని అంటున్నారు. అయితే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కూటమి జోరుకు బ్రేకులు వేసేలా జగన్ రెడ్డి ముందు నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తాజా ఎంపిక ద్వారా రుజువు అవుతోందని అంటున్నారు. కూటమి నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం, ప్రత్యక్ష ఎన్నికలు కావడం వల్ల సరైన అభ్యర్థిని రంగంలోకి దింపాలనే ఆలోచనతో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రమీలమ్మను జగన్ రెడ్డి పోటీకి దింపాలని జగన్ రెడ్డి భావిస్తున్నారని అంటున్నారు. కడప ఎంపీ అవినాశ్ రెడ్డికి స్వయాన చిన్నాన్న అయిన వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి ప్రమీలమ్మకు పులివెందుల పట్టణంలో మంచి గుర్తింపు ఉందని అంటున్నారు. స్థానికంగా మనోహర్ రెడ్డి, ప్రమీలమ్మ పార్టీ బాధ్యతలు చూస్తున్నందు వలన గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జగన్ రెడ్డి ఆలోచనగా ఉందని అంటున్నారు.పులివెందుల మున్సిపాలిటీ మాజీ సీఎం జగన్ రెడ్డి కుటుంబానికి కంచుకోటగా చెబుతున్నారు. పంచాయతీగా ఉన్నప్పటి నుంచి జగన్ రెడ్డి కుటుంబ సభ్యుల పెత్తనమే నడుస్తూ వస్తోందని అంటున్నారు. జగన్ రెడ్డి నాన్నమ్మ జయమ్మ గతంలో పంచాయతీ సర్పంచ్ గా పనిచేశారని, అప్పటి నుంచి 2005లో మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తర్వాత కూడా వైఎస్ కుటుంబ సభ్యుల హవానే కొనసాగిందని చెబుతున్నారు. ఇప్పటివరకు ఏకపక్షంగా గెలుచుకున్న పులివెందుల తమ కుటుంబ ప్రతిష్టకు నిదర్శనంగా జగన్ రెడ్డి భావిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇక్కడ నుంచి మరెకవరీ అవకాశం ఇవ్వకూడదని ఆలోచనతో ఆయన తన పిన్ని ప్రమీలమ్మను పోటీకి పెడుతున్నట్లుగా చెబుతున్నారు.

టీటీడీ కల్తీ నెయ్యి కేసులో ఈడీ దూకుడు !



హైదరాబాద్, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ), 2002 కింద రూ.129.85 కోట్ల విలువైన చర, స్థిరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసింది.భోలే బాబా ఆర్గానిక్ డెయిరీమిల్క్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు, వాటి ప్రమోటర్లు విపిన్ జైన్, పొమిల్ జైన్, వారి కుటుంబ సభ్యులు, సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, దాని ప్రమోటర్ కైలాశ్ చంద్ మంగ్లా, ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఇతర సంబంధిత వ్యక్తులు, సంస్థలకు చెందిన ఆస్తులను జప్తు ప్రక్రియలో భాగంగా అటాచ్ చేసినట్లు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం వెల్లడించింది.

ఇద్దరు ప్రమోటర్ల అరెస్ట్

ఈ కేసులో భోలే బాబా ఆర్గానిక్ డెయిరీమిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ విపిన్ జైన్, సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్, డైరెక్టర్ కైలాశ్ చంద్ మంగ్లాలను ఈడీ ఇప్పటికే అరెస్ట్ చేసింది. కల్తీ నెయ్యి తయారీ, టీటీడీకి అక్రమంగా సరఫరా చేసే వ్యవహారాన్ని వీరు నిర్వహించినట్లు దర్యాప్తు సంస్థ ఆరోపించింది.ఈ కేసులో, పీఎంఎల్ఏ సెక్షన్ 17 కింద గతంలో స్వాధీనం చేసుకున్న, స్తంభింపజేసిన ఆస్తులతో పాటు, తాజాగా జప్తు చేసిన రూ.129.85 కోట్ల విలువైన ఆస్తులను కలుపుకుని, ఇప్పటివరకు మొత్తం రూ.132.55 కోట్ల విలువైన ఆస్తులపై చర్యలు తీసుకున్నట్లు జూన వెల్లడించింది. ఈ వ్యవహారంపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఆ సంస్థ పేర్కొంది.

హవాలా లింకులు.. ఈడీ దర్యాప్తు

తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ దర్యాప్తు ప్రారంభించింది. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసేందుకు నేరపూరిత కుట్ర, మోసం, నకిలీ పత్రాల సృష్టి, అవినీతికి పాల్పడినట్లు ఎఫ్ఐఆర్‌లో ఆరోపణలు నమోదయ్యాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసిన సంబంధిత దర్యాప్తు సంస్థ నెల్లూరులోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్, అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేయడం ద్వారా టీటీడీని మోసం చేయడంతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు కలిగించి, భారీగా అక్రమ లాభాలు ఆర్జించినట్లు అందులో పేర్కొంది.

రూ.234.5 కోట్ల కల్తీ నెయ్యి సరఫరా

టీటీడీకి నేరుగా, మధ్యవర్తి డైరీల ద్వారా మొత్తం రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని 'భోలే బాబా' సంస్థ సరఫరా చేసిందని జూన దర్యాప్తులో వెల్లడైంది. ఐదు టెండర్లలో తమ సొంత పేర్లతో పాల్గొన్న కొన్ని డైరీలు, కమిషన్ కోసం మధ్యవర్తులుగా వ్యవహరించాయని దర్యాప్తు సంస్థ గుర్తించింది. వాస్తవానికి, ఆ కల్తీ నెయ్యి 'భోలే బాబా', 'సుకృతి ఫుడ్స్' కంపెనీల కేంద్రాలలోనే తయారు చేసినట్లు పేర్కొంది.శుద్ధి చేసిన పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, పామోలిన్‌లను మోనోగ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్స్, లాక్టిక్ యాసిడ్, బీటా-కెరోటిన్ వంటి రసాయనాలతో కలిపి నెయ్యిని తయారు చేసినట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. అయితే, ఈ పదార్థాలను ఇన్‌వాయిస్‌లలో తినదగిన నూనెలుగా పేర్కొన్నారు. ఖాతాలలో నిజమైన వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నట్లుగా కనిపించేలా చేయడానికి నకిలీ కొనుగోళ్లు, అమ్మకాలను నమోదు చేసినట్లు కూడా దర్యాప్తులో గుర్తించారు.కల్తీ నెయ్యి తయారీలో వినియోగించిన పామాయిల్‌ను బోగస్ కొనుగోలుదారులకు విక్రయించినట్లు రికార్డుల్లో చూపించినట్లు ఈడీ తెలిపింది. అదే సమయంలో పాలు, నెయ్యి కొనుగోళ్లు జరిగినట్లు, స్కిమ్డ్ మిల్క్ వంటి ఉప ఉత్పత్తులను విక్రయించినట్లు కల్పిత లావాదేవీలను నమోదు చేసి, నిజమైన డెయిరీ కార్యకలాపాలు జరుగుతున్నట్లు చిత్రీకరించినట్లు పేర్కొంది.ఈ నకిలీ కొనుగోళ్ల కోసం బ్యాంకింగ్ మార్గాల ద్వారా చెల్లించిన మొత్తాలను హవాలా మార్గాల ద్వారా నగదు రూపంలో తిరిగి రాబట్టుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ నగదును నకిలీ పామాయిల్ కొనుగోలుదారులకు చెల్లింపులు చేయడానికి, మధ్యవర్తి డెయిరీలకు కమీషన్లు చెల్లించడానికి, ఈ ప్లాన్లో పాలుపంచుకున్న ఇతర వ్యక్తులకు ప్రతిఫలాలు అందించడానికి ఉపయోగించినట్లు ఈడీ వెల్లడించింది.

16 ప్రాంతాల్లో సోదాలు.. రూ.2.7 కోట్ల నగదు, బ్యాంకు నిల్వలు స్వాధీనం

ఈ ఏడాది జూన్ 3న ఈడీ దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఉత్తరాఖండ్, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 16 ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టింది. ప్రధాన నిందితులు, మధ్యవర్తి డెయిరీలు, రసాయన సరఫరాదారులు, నకిలీ ఆర్థిక లావాదేవీలకు సహకరించిన వ్యక్తులకు సంబంధించిన ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. ఈ సందర్భంగా రూ.2.7 కోట్ల నగదు, బ్యాంకు నిల్వలను స్వాధీనం చేసుకోవడంతో పాటు స్తంభింపజేసినట్లు ఈడీ తెలిపింది.

విదేశీ మద్యం బ్రాండ్ల ధరలు పెంపు



హైదరాబాద్,దసరా పండుగ వేళ రాష్ట్రంలో మందుబాబులకు రాష్ట్ర ప్రభుత్వం ఊహించని షాకిచ్చింది. విదేశాల నుంచి దిగుమతి అయ్యే ప్రముఖ మద్యం బ్రాండ్లైన స్కాచ్, సింగిల్ మాల్ట్ విస్కీలు, వోడ్కా, జిన్, టేకిలా, వైన్ రకాల గరిష్ఠ రిటైల్ ధరలను ప్రభుత్వం సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 352 బ్రాండ్ల ధరలను 6 శాతం పెంచింది. సవరించిన ధరల ప్రకారం పలు టాప్ బ్రాండ్ల మద్యం ధరలు భారీగా పెరిగాయి.అయితే, వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు, డిస్టిబ్యూటర్లు సవరించిన కొత్త ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని తెలంగాణ అబ్కారీ శాఖ స్పష్టం చేసింది. నిర్ణయించిన ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించినా, నిబంధనలు ఉల్లంఘించినా షాపుల లైసెన్సులు రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.సింగిల్ మాల్ట్, స్కాచ్ విస్కీ సవరించిన ధరలు ఇలా ఉన్నాయి. గ్లెన్‌మోరంగీ సిగ్నెట్ (750 ఎంఎల్) రూ.50,660, గ్లెన్‌మోరంగీ 18 ఇయర్స్ (750 ఎంఎల్) రూ.27,270, రాయల్ సెల్యూట్ 21 ఇయర్స్ (750 ఎంఎల్) రూ.27,220, యమజాకి డిస్టిలర్స్ రిజర్వ్ (700 ఎంఎల్) రూ.17,450, హిబికి జపనీస్ హార్మొనీ (700 ఎంఎల్) రూ.17,400, గ్లెన్ గ్రాంట్ 18 ఇయర్స్ (700 ఎంఎల్) రూ.13,420, శివాస్ రీగల్ 18 ఇయర్స్ (750 ఎంఎల్) రూ.10,540, జానీ వాకర్ బ్లాక్ లేబుల్ (700 ఎంఎల్) రూ.5,140, శివాస్ రీగల్ 12 ఇయర్స్ (750 ఎంఎల్) రూ.4,940, జానీ వాకర్ రెడ్ లేబుల్ (700 ఎంఎల్) రూ.2,650గా నిర్ణయించారు.వోడ్కా, టేకిలా, జిన్ ధరలు ఇలా ఉన్నాయి. బెల్వెడెరే ఫ్యూర్ వోడ్కా (700 ఎంఎల్) రూ.7,280, హెండ్రిక్స్ జిన్ (700 ఎంఎల్) రూ.6,940, బెలుగా నోబుల్ రష్యన్ వోడ్కా (700 ఎంఎల్) రూ.5,810, గ్రే గూస్ వోడ్కా (750 ఎంఎల్) రూ.5,050, బాంబే సఫైర్ డ్రై జిన్ (750 ఎంఎల్) రూ.2,820గా నిర్ణయించారు.

అమెరికా నుంచి సీజేపీకి ఫండింగ్ - సంచలన ఆరోపణలు!



న్యూఢిల్లీ,కాక్రోచ్ జనతా పార్టీ , దాని వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే పై ఆఫ్రికన్-అమెరికన్ సింగర్ మేరీ మిల్బెన్ సోషల్ మీడియాలో సంచలన ఆరోపణలు చేశారు. మోదీని వ్యతిరేకించే అమెరికాకు చెందిన కొందరు పెద్దఎత్తున నిధులు సమకూరుస్తూ అభిజీత్ దిప్కే, ఆయన నేతృత్వంలోని కాక్రోచ్ పార్టీని రిమోట్ కంట్రోల్‌తో నడిపిస్తున్నారని ఆమె బాహాటంగా ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయవాద నేతలను లక్ష్యంగా చేసుకుని, విదేశాల్లో చదువుకున్న స్థానిక వ్యక్తులను మభ్యపెట్టి.. వారి స్వదేశాలకు పంపి అల్లర్లు, అస్థిరత సృష్టించే ఒక అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తోందని, అందులో భాగంగానే భారత్‌లో సీజేపీ వినాశాలు సాగుతున్నాయని ఆమె హెచ్చరించారు.ఈ వ్యవహారంలో ఒక అమెరికన్ గాయని జోక్యం చేసుకోవడం, ఆమెకు భారత్‌పై అంత ఆసక్తి ఎందుకన్నది పరిశీలిస్తే ఆసక్తికర అంశాలు వెలుగుచూస్తాయి. అమెరికా అధ్యక్షుల కార్యక్రమాల్లో గీతాలు ఆలపించిన అనుభవమున్న మేరీ మిల్బెన్.. భారతీయ సాంస్కృతిక అంశాలు, భారత జాతీయ గీతమైన జనగణమన , ఓం జై జగదీశ హరే భజనలను పాడి భారత ప్రజలకు దగ్గరయ్యారు. 2023లో ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఆయన పాదాలకు నమస్కరించి వార్తల్లో నిలిచిన ఆమె.. బీజేపీ భావజాలానికి, ప్రధాని మోదీ నాయకత్వానికి అంతర్జాతీయంగా గట్టి మద్దతుదారుగా కొనసాగుతున్నారు.ఈ పోస్టులో ఆమె ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఆకాశానికెత్తుతూ.. భారత్‌లోని యువతరం విదేశీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా జీవితంలో 25 ఏళ్లుగా సేవ చేస్తూ, 12 ఏళ్లుగా ప్రధానిగా ఉంటూ వరుసగా మూడుసార్లు ఎన్నికైన మోదీ లాంటి బలమైన నేత.. అమెరికాలోని విధ్వంసక శక్తులకు ఎప్పటికీ తలొగ్గరని ఆమె స్పష్టం చేశారు. భారత్‌లో పుట్టి, పెరిగి, చదువుకున్న స్వచ్ఛమైన భారతీయ యువత మేల్కోవాలని, కాక్రోచ్ పార్టీ రగిలిస్తున్న విచ్ఛిన్నకర పోకడలకు వ్యతిరేకంగా ఒక తిరుగుబాటు ఉద్యమాన్ని నిర్మించాలని దేశభక్తులకు పిలుపునిచ్చారు. అయితే, అభిజీత్ దిప్కే ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తన చదువుకు విశ్వవిద్యాలయ స్కాలర్‌షిప్, బ్యాంకు రుణాలు ఉపయోగపడ్డాయని, ఒకవేళ కాక్రోచ్ పార్టీలోకి విదేశీ నిధులు అక్రమంగా వచ్చి ఉంటే అది కేంద్ర హోంమంత్రి అమిత్ షా వైఫల్యమే అవుతుందని ఆయన ఎదురుదాడికి దిగారు.

విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన రూరల్ పోలీసులకు ప్రశంసా పత్రాలు

కరీంనగర్, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రశంసా పత్రాలు అందజేశారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా కార్యక్రమంలో ఎస్ఐ ఎ. లక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్లు రవి, అంజయ్య, సాగర్, మహిళా కానిస్టేబుల్ కీర్తనలను వారి పనితీరును గుర్తించి అభినందించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ప్రోత్సహించడంలో భాగంగా ఈ ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి సిబ్బందిని

మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం



హైదరాబాద్ ,తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ పనులు వేగం పుంజుకుంటున్నాయి. ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు అత్యంత ముఖ్యమైన జనరల్ కన్సల్టెన్సీ (జీసీ)ల నియామక ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు. మొత్తం ఏడు కారిడార్లలో తొలి దశలో నాలుగు కీలక మార్గాలకు జీసీలను ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టారు.మొత్తం రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో 122.9 కిలోమీటర్ల మేర మెట్రో ఫేజ్-2 విస్తరణ పనులు జరగనున్నాయి. ఇందులో భాగంగా రాయదుర్గం-కోకాపేట (11.6 కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), ఎల్బీనగర్-హయత్‌నగర్ (7.1 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.) కారిడార్ల పనుల పర్యవేక్షణ కోసం రెండు నెలల క్రితం టెండర్లు పిలిచారు. అయితే, ఆశించిన స్థాయిలో కంపెనీలు ముందుకు రాకపోవడంతో టెండర్ల గడువును ఈ నెల 22 వరకు పొడిగించారు. ఈ నాలుగు కారిడార్లకు జీసీల నియామకం పూర్తయితే పనుల్లో గణనీయమైన పురోగతి సాధించవచ్చని అధికారులు భావిస్తున్నారు.నిర్మాణ పనుల్లో జీసీల పాత్ర అత్యంత కీలకం. ప్రాజెక్టు డిజైన్ల రూపకల్పన, పనుల నాణ్యత పర్యవేక్షణ, కాంట్రాక్టర్లు, ఇతర సంస్థలతో సమన్వయం చేయడం వీరి ప్రధాన బాధ్యత. నిర్మాణ సమయంలో తలెత్తే సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు సూచిస్తూ, ప్రాజెక్టు పురోగతిని ఎప్పటికప్పుడు హెచ్ఎంఆర్ఎల్‌కు నివేదించాల్సి ఉంటుంది. జీసీల ఎంపికను 'క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్' (క్యూసీబీఎస్) పద్ధతిలో చేపట్టనున్నారు. అంటే, సంస్థల గత పనితీరు, సాంకేతిక సామర్థ్యం, నాణ్యతతో పాటు వారు కోట్ చేసిన వ్యయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ఎంపిక చేస్తారు.మరోవైపు, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పాతబస్తీ మెట్రో కారిడార్ (ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట) పనుల్లో ప్రధాన అడ్డంకి అయిన భూసేకరణ దాదాపుగా కొలిక్కి వచ్చింది. గతంలో అలైన్‌మెంట్‌లో మార్పుల కారణంగా అవసరమైన ఆస్తుల సంఖ్యను 1,400 నుంచి 888కి తగ్గించారు. ఇప్పటివరకు ఇందులో 833 ఆస్తులను సేకరించగా, మిగిలిన 55 ఆస్తుల సేకరణను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మార్గంలో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు. తొలగించిన ప్రతీ చెట్టుకు బదులుగా వేరే ప్రాంతంలో ఆరు మొక్కలు నాటాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

టీజీఎస్ఆర్టీసీలో 'దసరా' బాదుడు..!



మంచిర్యాల,టీజీఎస్ ఆర్టీసీలో దసరా బాదుడు మొదలైంది. పండుగ వాతావరణం షురూ అయ్యిందో లేదో.. ఆర్టీసీలో మాత్రం ఆర్థిక దోపిడీకి తెర తీశారు. ప్రత్యేకమనే పేరు పెట్టి ఆ బస్సుల్లో ప్రయాణించే వారి నుండి అదనపు చార్జీలు వసూలు చేస్తుండటమే దీనికంతటికి కారణం. సాధారణ చార్జీ కంటే రెండు వందలకు పైగా అదనంగా ముక్కుపిండి వసూలు చేస్తున్న ఘనత మాత్రం ఆర్టీసీ అధికారులకే దక్కుతోంది. ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామన్న పేరుతో అందులో.. ప్రత్యేకమనే బోర్డు తగిలించి 2 వందల రూపాయలకు పైగా ప్రయాణికుల జేబులకు చెల్లేలు వేస్తున్నారని విమర్శలు ఈ సందర్భంగా లేకపోలేదు. నాలుగు రోజులుగా మొదలైన ఈ దండుకునే పర్వం పూర్తి వివరాల్లోకి వెళితే...తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దసరా పండగ కోలాహలం మొదలైన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోనే అతిపెద్ద తెలుగు ప్రజల అతిపెద్ద పండుగ ఈ దసరా. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపంగా జరుపుకునే బతుకు పండగ ఇది. అలాంటి పండగ సీజన్ ఆరంభం అవగానే ఆర్టీసీ ఆపురావురుమంటూ పైకి లేచింది. ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నామంటూ ఊదరగొట్టే ప్రచారానికి తెరతీసింది.ప్రత్యేకమని చేపట్టిన బస్సులకు ఒక్కొక్కరి నుండి అదనంగా వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయమే ప్రయాణికుల పాలిట గుదిబండగా మారింది. హైదరాబాద్ - మంచిర్యాల మార్గంలో ఒక్కో ప్రయాణీకుడి నుండి 230 రూపాయల చొప్పున టిక్కెట్ చార్జీ వసూలు చేస్తుండడం గమనార్హం. మహిళలకు పూర్తిగా ఉచితం కాగా కొద్దోగొప్పో బస్సులు ఎక్కుతున్న పురుష ప్రయాణీకులకు 230 రూపాయలు అదనంగా వసూలు చేస్తుండడం విమర్శలకు దారితీస్తోంది.

శనివారం నుండే మొదలైన బాదుడు..!

దసరా పండగ.. ప్రయాణికులు, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకున్న ఆర్టీసీ అధికారులు ముందుగానే అప్రమత్తమయ్యారు. ప్రయాణికుల జేబులకు ఎలాగైనా చిల్లులు వేయాలని ఉద్దేశంతోటే కాబోలు ప్రత్యేక బస్సులను చేపట్టారు. పాఠశాలలు, కళాశాలలకు 10వ తేదీ నుండి దసరా సెలవులు ప్రకటించారని అలా చెవిన పడిందో లేదో ఇక 'ప్రత్యేక' నినాదానికి తెర తీశారు.ప్రయాణికుల రద్దీని ఆసరా చేసుకొని వారి అవసరాలు తీర్చుతున్నామనే కుంటి సాకులతో బస్సులను బూచిగా చూపెడుతున్న అధికారులు అదే సమయంలో ప్రయాణికుల జేబులకు చిల్లులు వేస్తున్నారనే సంగతి మాత్రం విస్మరించడం గమనించదగ్గ విషయం. గతంలో మంచిర్యాల నుండి హైదరాబాదు వెళ్లడానికి 500 రూపాయలు ఉన్న బస్సు టికెట్ చార్జికి ఇపుడు అదనంగా 230 రూపాయలు పెంచడం విశేషం. ఈ ధరలను కూడా సరిగ్గా పిల్లలకు సెలవు దినాలుగా ప్రకటించిన రోజు అంటే ఈనెల 10వ తేదీ శనివారం నుండి ఆర్టీసీ ఈ బాదుడు మొదలవడం గమనార్హం.

అమరావతి బ్రాండ్ ఇమేజ్‌కు మైలేజ్..!



అమరావతి, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అంతర్జాతీయ నాలెడ్జ్, డీప్-టెక్ హబ్‌గా మార్చే వ్యూహంలో భాగంగా ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేసింది. ఏపీ ఐటీ మరియు టెక్నాలజీ రంగాన్ని మలుపు తిప్పే ప్రతిష్టాత్మక "అమరావతి క్వాంటం వ్యాలీ" ప్రాజెక్టులో అత్యంత కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధాని పరిధిలోని ఉద్ధండరాయునిపాలెంలో నిర్మించ తలపెట్టిన క్వాంటం వ్యాలీ ఐకానిక్ ట్విన్ టవర్ల నిర్మాణ పనులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు.ఈ క్వాంటం వ్యాలీ టెక్ పార్కును సీడ్ యాక్సెస్ రోడ్డు మరియు కరకట్ట రోడ్డు మధ్య భాగంలోని ఉద్ధండరాయునిపాలెం పరిసరాల్లో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో భాగంగానే 11 ఎకరాల స్థలంలో ఈ రెండు భారీ ట్విన్ టవర్లను నిర్మించనున్నారు. మొత్తం 37.49 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో 'షెల్ అండ్ కోర్' పద్ధతిలో అంతర్జాతీయ మౌలిక సదుపాయాలతో టీ1, టీ2 టవర్లు రూపుదిద్దుకోనున్నాయి.ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటం టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ సాగుతోంది. దక్షిణాసియాలోనే మొదటి ప్రత్యేక క్వాంటం వ్యాలీగా గుర్తింపు పొందుతున్న ఈ టెక్ పార్కులో.. అంతర్జాతీయ టెక్ దిగ్గజాల భాగస్వామ్యంతో భారతదేశంలోనే అతిపెద్ద '156-క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ సెంటర్' ఏర్పాటు కానుంది. క్వాంటం టెక్నాలజీ ఆధారంగా డిఫెన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్యాంకింగ్ మరియు హెల్త్‌కేర్ విభాగాల్లో సరికొత్త ఆవిష్కరణలు చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.ఈ ట్విన్ టవర్ల నిర్మాణం పూర్తి అయితే దేశ, విదేశాలకు చెందిన వందలాది డీప్-టెక్ స్టార్టప్‌లకు, పరిశోధనా సంస్థలకు అమరావతి వేదికగా మారనుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికే క్వాంటం వ్యాలీ ప్రధాన మౌలిక వసతుల పనులను పూర్తి చేసి.. వచ్చే ఏడాది నుంచి ఇక్కడ క్వాంటం కంప్యూటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. శంకుస్థాపన పూర్తి కావడంతో అమరావతి అభివృద్ధి నిర్మాణాల్లో కదలిక వచ్చిందని, ఇది రాబోయే రోజుల్లో ఏపీ ఐటీ రంగానికి భారీగా పెట్టుబడులను, వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలను తెచ్చిపెట్టనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140